సాక్షి
నారాయణపేట
సోమవారం ; 28 ; జూలై ; 2025



వరదొస్తే.. రాకపోకలు బంద్
వర్షాకాలం వరదలకు దుందుభీ వాగు పరీవాహకంలో రాకపోకలు నిలిచిపోతున్నాయి.
వివరాలు 8లో ▸



మళ్లీ పెరిగిన వరద
జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి మళ్లీ వరద పెరిగి 1.08 లక్షల క్యూసెక్కులకు చేరింది.
వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
28.7 /22.1

వాతావరణం
రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల స్వీకరణ

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలోని ఎర్రగుట్ట సమీపంలో ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎస్‌ఓ శ్వేతజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీలో 10 సీట్లు ఖాళీగా ఉన్నాయని.. ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్థానికత ప్రాధాన్యతతో పాటు ఎస్ఎస్‌సీ మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తామని.. తల్లిదండ్రులు లేని పిల్లలకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.

జాతీయ హ్యాండ్‌బాల్ టోర్నీలో గోల్డ్‌మెడల్


చర్విత్

నారాయణపేట రూరల్/మరికల్: పంజాబ్ రాష్ట్రంలోని చండీగఢ్‌లో ఈ నెల 15నుంచి 26వ తేదీ వరకు జరిగిన 54వ జాతీయ స్పోర్ట్స్ మీట్‌లో మరికల్ మండలం తీలేర్‌కు చెందిన చర్విత్ ఆచారి అత్యుత్తమ ప్రతిభకనబరిచి గోల్డ్‌మెడల్ సాధించారు. మహబూబ్‌నగర్‌లోని కేంద్ర విశ్వవిద్యాలయంలో 8వ తరగతి చదువుతున్న అతడు.. అండర్–14 విభాగం హ్యాండ్‌బాల్ టోర్నీలో తెలంగాణ జట్టు తరఫున పాల్గొని విజేతగా నిలిచారు. వచ్చే నెలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరులో జరిగే అంతర్జాతీయ పోటీల్లో పాల్గొననున్నట్లు చర్విత్ ఆచారి తెలిపారు. తెలంగాణ నుంచి పోటీలో నిలిచేందుకు అవకాశం దక్కడం తన అదృష్టమని అన్నారు. జాతీయస్థాయి పోటీల్లో రాణించిన చర్విత్‌ను డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్ రెడ్డి అభినందించారు.

ప్రశాంతంగా అర్హత పరీక్షలు

నారాయణపేట: గ్రామ పాలన అధికారులు (జీపీఓ), లైసెన్స్‌డ్ సర్వేయర్ పోస్టుల భర్తీ నిమిత్తం ఆదివారం జిల్లా కేంద్రంలోని చిట్టెం నర్సిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అర్హత పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జరిగిన జీపీఓ పరీక్షకు 76మంది అభ్యర్థులకు గాను 73మంది హాజరయ్యారు. లైసెన్స్‌డ్ సర్వేయర్ల పరీక్షకు సంబంధించి మొదటి సెషన్ 10నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జరిగిన పరీక్షకు 106 మందికి గాను 96 మంది హాజరు కాగా.. రెండో సెషన్ మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు జరిగిన పరీక్షకు 95 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. నిబంధనలకు అనుగుణంగా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించినట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ వెంట ఆర్డీఓ రామచందర్ నాయక్, సర్వే ల్యాండ్ ఏడీ గిరిధర్, తహసీల్దార్ అమరేంద్ర కృష్ణ తదితరులు ఉన్నారు.

రామన్‌పాడులో నిలకడగా నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో ఆదివారం సముద్రమట్టానికి పైన 1,020 అడుగులు ఉన్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు. జూరాల ఎడమ కాల్వ నుంచి 550 క్యూసెక్కులు, సమాంతర కాల్వ నుంచి 200 క్యూసెక్కుల వరద జలాశయానికి చేరుతుండగా.. ఎన్టీఆర్ కాల్వకు 679 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వలకు 30 క్యూసెక్కులు, వివిధ ఎత్తిపోతల పథకాలకు 872 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు వివరించారు.

రోడ్డు విస్తరణ పూర్తయ్యేనా?

- మద్దూరులో ఏడాదిన్నరగా కొనసాగుతున్న పనులు
- నేటికీ 50శాతం కూడా పూర్తికాని వైనం
- రాకపోకలు సాగించలేక అవస్థలు పడుతున్న ప్రజలు

– మద్దూరు



వివరాలు 9లో ▸

ఆశల వాన!

వారం రోజులుగా కురుస్తున్న వర్షాలు


జలకళ సంతరించుకున్న మాగనూర్ పెద్దచెరువు

- చెరువులు, కుంటలకు చేరుతున్న నీరు
- సంగంబండ రిజర్వాయర్‌లో గేట్లు ఎత్తివేత
- ఆయకట్టు రైతుల్లో హర్షాతిరేకాలు

నారాయణపేట: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతుల్లో ఆశలు నింపుతున్నాయి. ఈ ఏడాది వానాకాలం ప్రారంభమైన తర్వాత వర్షాలు అంతంత మాత్రంగానే కురిశాయి. ఈ నెలలో సైతం మూడు వారాలుగా వరుణుడు కరుణించలేదు. ఒక్కానొక దశలో వర్షాల కోసం రైతులు వెయ్యి కళ్లతో ఎదురుచూశారు. పలు గ్రామాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో జిల్లాలోని 769 చెరువులు, కుంటలతో పాటు భూత్పూర్, సంగంబండ రిజర్వాయర్లలోకి నీరు వచ్చి చేరుతుండటంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నెల 27వ తేదీ వరకు జిల్లాలోని 5 మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదు కాగా.. మిగతా మండలాల్లో సాధారణ వర్షపాతమే నమోదైంది. జిల్లావ్యాప్తంగా చూస్తే వర్షపాతం నమోదు సాధారణమేనంటూ అధికారుల గణాంకాలు చెబుతున్నాయి.

చేపపిల్లలు వదిలేందుకు అనుకూలం..

జిల్లాలోని 641 చెరువుల్లో చేపపిల్లలు వదిలేందుకు అనుకూలంగా మారాయి. గతేడాది వర్షాలు ఆలస్యం కావడంతో పాటు చేపపిల్లల పంపిణీ టెండర్లు సైతం ఆలస్యమయ్యాయి. ఈ ఏడాది చెరువులు, రిజర్వాయర్లలో నీటి శాతం అనుకూలంగా ఉండటంతో త్వరగా టెండర్లు పిలిచి చేపపిల్లలను వదిలితే బాగుంటుందని మత్స్యకారులు అభిప్రాయపడుతున్నారు.

జిల్లాలోని చెరువుల్లో చేరిన నీటిశాతం ఇలా..

మండలం	0-25	26-50	51-75	76-100	నిండినవి	మొత్తం
మక్తల్	12	42	28	08	05	95
మాగనూర్	-	37	02	02	02	43
కృష్ణా	14	13	10	-	01	38
నారాయణపేట	80	55	19	02	-	156
ఊట్కూర్	24	25	02	03	02	56
ధన్వాడ	25	13	05	01	-	56
దామరగిద్ద	48	12	-	-	-	60
మద్దూర్	53	05	-	-	-	58
కొత్తపల్లి	31	07	01	-	-	39
కోస్గి	26	23	06	-	-	55
గుండుమాల్	08	20	06	-	-	34
మరికల్	43	-	-	-	-	43
నర్వ	45	-	-	-	03	48
మొత్తం	409	252	79	16	13	769

ఆనందంగా ఉంది..



వర్షాకాలం ప్రారంభమై నెలన్నర గడిచినా పెద్దగా వర్షాలు లేకపోవడంతో బోరు బావుల్లో నీటిమట్టం పెరగలేదు. పంటలు పండుతాయో లేదో అన్న బెంగ ఉండేది. వారం రోజులుగా కురిసిన వర్షాలతో మా ఊరి చెరువు నిండింది. మరో రెండు, మూడు భారీ వర్షాలు పడితే చెరువు అలుగు పారుతుంది. ఆయకట్టు కింద ఉన్న రైతులకు సాగునీరు అందుతుంది. బోరుబావుల్లో నీటి మట్టం పెరుగుతుంది.

– డొల్ల నరేశ్, రైతు, మాగనూర్

మండలాల వారీగా జూలై 27 వరకు నమోదైన వర్షపాతం ఇలా (మి.మీ.)లలో..

మండలం	సాధారణం	కురిసింది
దామరగిద్ద	222	300
నారాయణపేట	237	218
ఊట్కూర్	215	282
మాగనూర్	207	222
కృష్ణా	197	227
మక్తల్	183	190
నర్వ	202	226
మరికల్	214	293
ధన్వాడ	235	234
మద్దూర్	194	277
కోస్గి	249	309
గుండుమాల్	222	239
కొత్తపల్లి	194	221

కృష్ణమ్మ పరవళ్లు..

భారీ వర్షాలకు తోడు ఎగువ నుంచి వస్తున్న వరదతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. కృష్ణా మండలం తంగిడి–కుసుమూర్తి వద్ద రాష్ట్రంలోకి ప్రవేశిస్తూ జూరాల దిశగా పరుగులు తీస్తోంది. జూరాల బ్యాక్‌వాటర్‌తో కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలోని రైతులు ఆనందం వ్యక్తమవుతోంది. జూన్, జూలైలోనే వరద పోటెత్తడంతో ముందస్తుగా వరిసాగు చేసుకునేందుకు వీలైందంటూ సంబరపడుతున్నారు.


సంగంబండ రిజార్వాయర్ గేటు ఎత్తడంతో దిగువకు విడుదలవుతున్న నీరు

వామ్మో.. చిరుత

నిత్యం.. కలకలం

జనావాసాల్లోకి చిరుతలు


టీడీ గుట్టపై కనిపించిన చిరుత (ఫైల్)

- పట్టణ, మండల శివార్లలోని గుట్టల్లో ఆవాసం
- రోజుకో చోట దర్శనం.. గొర్రెలు, మేకలు, పశువులపై దాడి
- ఒక్క మహబూబ్‌నగర్ జిల్లాలో 15 నుంచి 18 వరకు చిరుతలు
- ఫలితం లేని అధికారుల ఆపరేషన్.. భయంభయంగా ప్రజల జీవనం
- కొత్లాబాద్‌లో ముగ్గురిపై దాడితో స్థానికుల్లో ఆందోళన

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ఇటీవల వీరన్నపేట, మొన్న టీడీగుట్ట, చౌదర్‌పల్లి, నిన్న మొగుళ్లపల్లి.. ఇలా జిల్లాలో నిత్యం ఏదో ఒక్క చోట చిరుతలు దర్శనమిస్తూనే ఉన్నాయి. ఎక్కడో అటవీ ప్రాంతంలో అవి కనపడుతున్నాయని అనుకుంటే పరవాలేదు. కానీ జనావాసాల పరిధిలోనే దర్శనమిస్తుండడంతో ప్రజలు హడలెత్తుతున్నారు. సుమారు నెల రోజులుగా ఆయా ప్రాంతాల వారికి కంటి మీద కునుకు లేకుండా పోయింది. అయితే చిరుత పులులు కనపడడం.. తదితర చోట్ల గొర్లు, మేకలు, పశువులపై దాడి చేసిన ఘటనలే ఇప్పటి వరకు ఉన్నాయి. తాజాగా కోయిల్‌కొండ మండలం కొత్లాబాద్, హన్వాడా మండలం రామన్నపల్లి శివారులో ముగ్గురిపై చిరుత దాడి చేసిన నేపథ్యంలో ప్రజల్లో మరింతగా భయాందోళనలు నెలకొన్నాయి.

ముగ్గురిపై దాడితో బీ అలర్ట్..

కొత్లాబాద్ శివారులో గొర్రెల కాపరితో పాటు మరో ఇద్దరు రైతులపై చిరుత దాడి నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. సాధారణంగా ప్రజలపై అవి దాడికి దిగవని.. సదరు వ్యక్తులు కుక్క అనుకుని టార్చిలైట్ వేయడం, తరముతున్న క్రమంలో చిరుత దాడికి దిగినట్లు తెలుస్తోందని వెల్లడించారు. అయితే ప్రస్తుతం వ్యవసాయ సీజన్ కావడంతో గుట్టల పరిసరాల్లో పొలాలకు వెళ్లేందుకు రైతులు జంకుతున్నారు. అదేవిధంగా గుట్టల పరిసరాల్లో నివసిస్తున్న ప్రజలు నిత్యం భయాందోళనల మధ్య సాయంత్రం కాగాలే ఇళ్లకు తలుపులేసి భయం భయంగా కాలం వెళ్లదీస్తున్నారు.

జిల్లాలో 15 నుంచి 18 వరకు..

మహబూబ్‌నగర్ జిల్లాకు సంబంధించి మహబూబ్‌నగర్ రేంజ్ పరిధిలో 19,132 హెక్టార్లు, మహమ్మదాబాద్ రేంజ్ పరిధిలో 7,852 హెక్టార్ల విస్తీర్ణంలో అడవులు విస్తరించి ఉన్నాయి. ఈ ఫారెస్ట్‌లో ప్రస్తుతం 15 నుంచి 18 వరకు చిరుతలు ఉన్నట్లు సంబంధిత అధికారులు అంచనా వేస్తున్నారు. మహబూబ్‌నగర్ పట్టణంతో పాటు పలు మండలాలు, గ్రామాలను ఆనుకుని సహజసిద్ధంగా గుట్టలు ఉండగా.. వాటిని చిరుత పులులు ఆవాసాలుగా ఏర్పరచుకున్నాయి.

ఆహారం దొరక్క జనావాసాల్లోకి..

ప్రధానంగా అడవి పందులు, అడవి కుందేళ్లు, నెమళ్లు ఇతరత్రా వన్యప్రాణులతో పాటు అక్కడక్కడా నీటి సదుపాయం ఉండడం.. జూన్ నుంచి ఆగస్టు వరకు సంపర్క సమయం కావడంతో ఆయా గుట్టల ప్రాంతాల్లో చిరుతలు నివాసం ఏర్పరుచుకున్నట్లు తెలుస్తోంది. ఇందుకు వీరన్నపేట–టీడీగుట్ట మధ్య ఉన్న గుర్రంగట్టు గుట్టపై, ధర్మాపూర్ సమీపంలోని చౌదర్‌పల్లి గుట్టపై, నవాబుపేట మండలంలోని మొగుళ్లపల్లి గుట్టపై చిరుతలు కనిపించడమే నిదర్శనం. ఈ క్రమంలో ఆహారం దొరకనప్పుడు గుట్టల సమీపంలోని నివాస ప్రాంతాల్లో గొర్రెలు, మేకలు, పశువుల మందలపై దాడులు చేస్తున్నాయి.

ఫలితం లేని ఆపరేషన్..

ఆయా ప్రాంతాల్లో జిల్లా అధికార యంత్రాంగం చేపట్టిన ఆపరేషన్ చిరుతతో ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. మహబూబ్‌నగర్‌లోని వీరన్నపేట, టీడీగుట్ట మధ్య ఉన్న గుర్రంగట్టుపై జూన్ 30న చిరుత మొదటిసారిగా కనిపించింది. ఆ తర్వాత ఈ నెల రెండో తేదీన మళ్లీ దర్శనమిచ్చింది. ఈ నేపథ్యంలో కలెక్టర్, విజయేందిర బోయి, ఎస్పీ జానకి స్వయంగా ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాలతో ఆ ప్రాంతంలో ముందుగా రెండు, ఆ తర్వాత మరో రెండు బోన్లు ఏర్పాటు చేశారు. తెల్లారి అదే గుట్టపై ఒకేసారి రెండు చిరుతలు కనపడ్డాయి. కానీ.. ఇప్పటివరకు అవి చిక్కలేదు. దీంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గస్తీ నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం అచ్యుతాపూర్‌లో చిరుత ముగ్గురిపై దాడి చేయగా.. ముందు రోజే ఆ గ్రామ సమీపంలోని కొత్లాలాబాద్‌లో బోన్ ఏర్పాటు చేశారు. అయినా ఫలితం లేకపోగా.. ముగ్గురిపై దాడి నేపథ్యంలో స్థానికుల్లో భయాందోళనలు నెలకొన్నాయి.

అన్ని చోట్ల కెమెరాలతోపాటు బోన్లు ఏర్పాటు చేశాం..

జూన్ నుంచి ఆగస్టు వరకు చిరుతల సంపర్కానికి అనుకూల సమయం. ప్రస్తుతం అవి జనావాసాల్లోకి రావడానికి కారణాలు అంతుచిక్కడం లేదు. ఆహారం, నీరు సమృద్ధిగా దొరకనప్పుడే అవి నివాసిత ప్రాంతాలకు వస్తాయి. చిరుతలు అనుకోని సందర్భాల్లో తప్ప మనుషులపై దాడి చేసిన ఘటనలు చాలా తక్కువ. గుట్టల సమీప ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పిల్లలను ఒంటరిగా వదిలేయొద్దు. ఎక్కడికి వెళ్లినా గుంపులుగానే పోవాలి. వాటిని బంధించేందుకు అన్ని చోట్ల బోన్లు ఏర్పాటు చేశాం. కెమెరాలతో నిత్యం పర్యవేక్షిస్తున్నాం.

– సత్యనారాయణ, డీఎఫ్ఓ, మహబూబ్‌నగర్

చిరుత జాడ లేకుండా ఏ ఒక్క నెల లేదు..



చిరుతల సంచారంతో వణికిపోతున్నాం. వ్యవసాయ పనులకు వెళ్లాలంటే భయమైతాంది. సాయంత్రం అయ్యిందంటే చాలు.. ఊరంతా తలుపులేసుకుని ఇంట్లోనే ఉంటున్నారు. చిరుత జాడ లేకుండా కనీసం ఏ ఒక్క నెల లేదు. గత నెలలో మా గ్రామంలోని ఓ రైతుకు చెందిన పశువుల పాకలో కట్టేసిన లేగదూడను చిరుత ఎత్తుకుని వెళ్లి రక్తం తాగి పడేసింది.

– రవి, మొగుళ్లపల్లి, నవాబుపేట

గురుకులంలో ఫుడ్ పాయిజన్


నాగర్‌కర్నూల్ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

- ఉయ్యాలవాడలోని బీసీ గురుకుల పాఠశాలలో 64 మంది విద్యార్థినులకు అస్వస్థత
- కడుపునొప్పి, వాంతులు, విరేచనాలతో ఆస్పత్రిలో చేరిక
- గడువుతీరిన పాలు, పెరుగు వల్లే ఘటన
- ఉడకని భోజనం, నాసిరకం సరుకుల వినియోగం
- జిల్లాలోని అన్నిచోట్ల ఇష్టారాజ్యంగా క్యాటరింగ్ నిర్వహణ?

సాక్షి, నాగర్‌కర్నూల్: జిల్లాకేంద్రం సమీపంలోని మహాత్మ జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలలో విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌తో ఆస్పత్రిలో చేరిన ఘటన కలకలం సృష్టించింది. శనివారం రాత్రి భోజనం చేసిన తర్వాత అస్వస్థతకు గురైన విద్యార్థినులు 64 మందిని జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. కడుపు నొప్పి, వాంతులు, విరేచనాలతో ఇబ్బంది పడుతున్న విద్యార్థినులకు ఆస్పత్రిలో చికిత్స అందించిన వైద్యులు ఆదివారం సాయంత్రానికి డిశ్చార్జి చేశారు. అయితే పాఠశాలలో వంట కోసం వినియోగించిన సరుకులు నాసిరకంగా ఉండటం, గడువు తీరిన పాలు, పెరుగు పదార్థాలను వినియోగించడం వల్లనే ఫుడ్ పాయిజన్ చోటుచేసుకున్నట్టు తెలుస్తోంది. పాఠశాలకు సంబంధించిన క్యాటరింగ్ కాంట్రాక్టర్ బయట నుంచి పాలు, పెరుగు డబ్బాలను కొనుగోలు చేసి విద్యార్థినులకు వడ్డిస్తున్నారు. ఈ క్రమంలో నిర్ణీత కాలం పాటు, రెండు, మూడు రోజుల్లోపే వినియోగించాల్సిన పాలు, పెరుగు డబ్బాలను ఎక్స్‌పైరీ తేదీ దాటినా వినియోగించడంతోపాటు ప్రధానంగా పెరుగన్నం తిన్న విద్యార్థినులు అస్వస్థతకు గురైనట్లు తెలిసింది.

భయంతో ఇంటిదారి..

ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థినులు కడుపు నొప్పి, వాంతులు, విరేచనాలతో ఆస్పత్రిలో చేరడంతో పాఠశాలలోని మిగతా విద్యార్థులు సైతం భయాందోళనకు గురయ్యారు. ఉయ్యాలవాడ బీసీ గురుకుల పాఠశాలలో 480 మంది విద్యార్థులతోపాటు మరో 360 మంది ఇంటర్మీడియట్ కళాశాల విద్యార్థులు చదువుతున్నారు. ఫుడ్ పాయిజన్‌తో 64 మంది ఆస్పత్రిలో చేరి చికిత్స తీసుకోగా, మరో 30 మంది వరకు భయాందోళనకు గురై జనరల్ ఆస్పత్రిలోని ఔట్ పేషెంట్ విభాగంలో చూయించుకున్నారు. విద్యార్థినులు ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన తర్వాత కొంతమంది తమ తల్లిదండ్రులతో కలిసి ఇంటికి వెళ్లిపోయారు. చాలామంది విద్యార్థులు భయాందోళనలో ఉన్న కారణంగా వారి తల్లిదండ్రులు తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్లడం కనిపించింది.

అమలుకాని మెనూ..

జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ గురుకుల హాస్టళ్లలో ఎక్కడా డైట్ మెనూ సరిగా అమలుకావడం లేదు. ఉదయం పూట టిఫిన్ కింద పూరి, ఇడ్లి, చపాతి, దోశ ఇవ్వాల్సి ఉండగా.. చాలాసార్లు లెమన్ రైస్, కిచిడీ, పులిహోరతో సరిపెడుతున్నారు. మధ్యాహ్నం భోజన సమయంలో మిక్స్‌డ్ వెజ్ బిర్యానీ, రెండేసి కూరలతో వడ్డించాల్సి ఉండగా.. పప్పులు, సాంబారుతో నెట్టుకొస్తున్నారు. వారంలో చికెన్, గుడ్లు, స్నాక్స్ విషయంలో కోత విధిస్తున్నారు. వంట గదుల్లో శుచి, శుభ్రత పాటించకపోవడం, శుభ్రమైన నీటిని వినియోగించకపోవడంతో తరుచుగా ఫుడ్ పాయిజన్ ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. గురుకుల హాస్టళ్ల నిర్వహణపై క్షేత్రస్థాయిలో సరైన పర్యవేక్షణ కొరవడటంతో నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సరికొత్తగా సైబర్ మోసాలు

నారాయణపేట క్రైం: సైబర్ నేరగాళ్లు సరికొత్తగా మోసాలకు పాల్పడుతున్నారని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. విలాసవంతమైన వస్తువులు, ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేస్తామని రకరకాల మాయమాటలతో మభ్యపెట్టి మోసాలకు పాల్పడుతున్నారన్నారు. ప్రధానంగా గొలుసుకట్టు వ్యాపారాలకు తెరలేపుతున్నారని తెలిపారు. ప్రస్తుతం సైబర్ నేరాలు చోటు చేసుకుంటున్న తీరు, సైబర్ నేరాలకు ప్రజలు గురవుతున్న విధానాలపై ప్రతి ఒక్కరూ అవగాహనతో జాగ్రత్త పడాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. మొబైల్ లేదా సోషల్ మీడియా ప్లాట్ ఫామ్‌లో అనేక కంపెనీల పేర్లతో లింక్‌లు పంపిస్తూ మోసాలకు గురిచేస్తున్నట్లు తెలిపారు. అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల బారినపడి మోసపోతే వెంటనే డయల్ 1930 లేదా సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు.

పెండింగ్ బిల్లులు చెల్లించండి



కోస్గి: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్సీ ప్రకటించి.. అన్ని డీఏలతో పాటు పెండింగ్ బిల్లులు చెల్లించాలని తపస్ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం గుండమాల్, కోస్గి మండలాల్లో ఆ సంఘం నాయకులతో ఆయన సమావేశమై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ పదోన్నతుల ప్రక్రియ ప్రారంభించడాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. గతంలో కొందరు భాషా పండిట్లు, పీఈటీలను అప్‌గ్రేడ్ చేయలేదన్నారు. మిగిలిన వారికి పదోన్నతులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. జీఓ 317 బాధితులకు న్యాయం చేయాలని, డీఎస్సీ 2008 కాంట్రాక్ట్ టీచర్లకు ప్రతి నెలా వేతనాలు చెల్లించాలని కోరారు. మోడల్ స్కూల్, కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. సమావేశంలో ఆ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు మల్లికార్జున్, కార్యదర్శి అంజిలయ్య, ఆయా మండలాల ప్రతినిధులు పరందాములు, వెంకట్రాములు, ఆంజనేయులు, రాఘవేందర్, వెంకటేష్, అర్జున్, చంద్రమౌళి, రవితేజ, సత్య కుమార్ తదితరులు ఉన్నారు.

భూ నిర్వాసితులకు అన్యాయం


మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్

నారాయణపేట: పేట–కొడంగల్ ఎత్తిపోతల పథకం భూ నిర్వాసితులకు ప్రభుత్వం న్యాయమైన పరిహారం చెల్లించకుండా అన్యాయం చేస్తోందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో భూ నిర్వాసితులు చేపట్టిన రిలే దీక్షలకు ఆయన మద్దతు ప్రకటించి మాట్లాడారు. ఎకరాకు రూ. 14లక్షల పరిహారం ఇవ్వడం ఆమోదయోగ్యం కాదని రైతులు ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకుండా బలవంతంగా భూ సేకరణ చేపట్టడం మంచిది కాదన్నారు. చట్టం ప్రకారం రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రిగా ఈ ప్రాంతవాసి రేవంత్‌రెడ్డి ఉన్నప్పటికీ రైతులకు మేలు జరగడం లేదని.. ఉద్యమాలు తప్పడం లేదన్నారు. భూ నిర్వాసితుల విషయంలో ప్రభుత్వ పెద్దలు పెద్ద మనసుతో ఉండాల్సింది పోయి.. పంతానికి పోవడం, రైతులను ప్రలోభాలకు గురిచేయడం, ఆర్డీఓ స్థాయి అధికారితో బెదిరింపులకు పాల్పడటం మంచిది కాదన్నారు. ఎద్దు ఏడిసిన వ్యవసాయం.. రైతు ఏడిసిన రాజ్యం బాగుపడదనే విషయం గుర్తెరిగి వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో భూ నిర్వాసితుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, అధ్యక్షుడు మశ్చందర్, ఉపాధ్యక్షుడు ధర్మరాజుగౌడ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రాం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైతు బలవన్మరణం

మాగనూర్: సాగునీటి పంచాయితీలో ఓ రైతు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని మందిపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ అశోక్ బాబు కథనం మేరకు.. గ్రామానికి చెందిన కుర్వ సాయిబన్న (48)కు గ్రామ సమీపంలో వ్యవసాయ పొలం ఉంది. సమీప బంధువుల పొలం కింద ఇతడి భూమి ఉండటంతో సాగు నీరు వదలాలని కోరారు. అందుకు వారు నిరాకరించడంతో ఆదివారం గ్రామపెద్దల వద్ద పంచాయితీ పెట్టారు. అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో మనస్తాపానికి గురై పొలం వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య మల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ వివరించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గండీడ్: గడ్డిమందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని చెల్లిల్లలో ఆదివారం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన మోహన్ హైదరాబాద్ నుంచి ఆదివారం మధ్యాహ్నం ఇంటికి వచ్చీరాగానే గడ్డిమందు తాగాడు. విషయాన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు, స్థానికులు 108లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి నిలకడగా ఉందని బంధువులు తెలిపారు. ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియరాలేదు.

క్షణికావేశంలో గొంతు కోసుకున్న వ్యక్తి

తిమ్మాజిపేట: కుటుంబంలో చిన్నపాటి గొడవ కావడంతో క్షణికావేశంలో గోనెల శేఖర్ గొంతు కోసుకున్న ఘటన ఆదివారం తిమ్మాజిపేట పోలీస్‌స్టేషన్ ఎదుట చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. మండలంలోని ఆవంచ గ్రామానికి చెందిన గోనెల శేఖర్ గతంలో జడ్చర్ల సమీపంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేసేవాడు. కానీ కొన్నిరోజులు ఏం పని చేయకుండా ఊరికే తిరుగుతుండడంతో పాటు తాగుడుకు బానిసయ్యాడు. ఈ విషయమై కుటుంబ సభ్యుల మధ్య గొడవ జరగడంతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చాడు. ఈ క్రమంలో క్షణికావేశానికి లోనై తన వెంట తెచ్చుకున్న బ్లేడ్‌తో గొంతు కోసుకున్నాడు. గమనించిన స్థానికులు హుటాహుటిన బాధితుడిని జడ్చర్ల ఆస్పత్రికి తరలించి చికిత్స అనంతరం ఇంటికి పంపించారు. ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు

ఆగి ఉన్న లారీని ఢీకొన్న బైక్.. వ్యక్తి మృతి


గోవిందాచారి (ఫైల్)

మిడ్జిల్: ఆగి ఉన్న లారీని ప్రమాదవశాత్తు బైక్ ఢీకొట్టిన ఘటనలో బైక్ మీద ఉన్న వ్యక్తి మృతిచెందాడు. ఈఘటన జడ్చర్ల-కల్వకుర్తి ప్రధాన రహదారిపై మిడ్జిల్ మండలంలోని వాడ్యాల్ గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా.. మిడ్జిల్ మండలంలోని బోయిన్‌పల్లి గ్రామానికి చెందిన గోవిందాచారి (55) ఆదివారం మధ్యాహ్నం పని మీద జడ్చర్ల బైక్‌పై వెళ్లి.. తిరిగి రాత్రి 8 గంటలకు జడ్చర్ల నుంచి ఇంటికి బయల్దేరాడు. వాడ్యాల్ సమీపంలో జడ్చర్ల కల్వకుర్తి 167 జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని మోటార్ సైకిల్‌పై వస్తున్న గోవిందాచారి ఎదురుగా వస్తున్న వాహనాల వెలుతురుకు ముందు ఉన్న వాహనం కన్పించకపోవడంతో లారీ వెనుకవైపు ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని మృతుడి కుటుంబసభ్యులకు విషయం తెలిపి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య మంగమ్మతో పాటుగా ఇద్దరు పిల్లలు ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ కమిటీ ఎన్నిక



జడ్చర్ల: ఉమ్మడి పాలమూరు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం పోలేపల్లి సెజ్‌లోని ఎస్‌వీకేఎం స్కూల్‌లో ఎన్నుకున్నారు. చైర్మన్‌గా గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడిగా సయ్యద్ తకీయుద్దీన్, ప్రధాన కార్యదర్శిగా శంకర్‌నాయక్, కోశాధికారిగా కాల్వ రాంరెడ్డి, ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్, మన్యం, సోయబ్ అలీ, రమణ, సంయుక్త కార్యదర్శులుగా అశోక్, ఉమా శంకర్, యాదయ్య, మొగులాల్, ఇంతియాజ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా అభిలాష్, కార్యవర్గ సభ్యులుగా రవి, నర్సింహా, సతీశ్, అశోక్, శివకుమార్, రాఘవేందర్ రెడ్డి, రవి, అనిల్, ప్రశాంత్, మహేశ్‌ను ఎన్నుకున్నారు. రాష్ట్ర నాయకులు పుల్లయ్య, శరత్‌చంద్ర ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు.

వరదొస్తే.. రాకపోకలు బంద్

దుందుభి పరివాహక ప్రాంతాల ప్రజల అగచాట్లు


దుందుభీ వాగుపై ప్రమాదకరంగా వాగు దాటుతున్న కూలీలు

- వంతెనలు నిర్మిస్తేనే ప్రయోజనం
- దశాబ్దాలుగా ప్రజల ఎదురుచూపులు
- తాజాగా నిధుల మంజూరుకు ప్రతిపాదనలు

జడ్చర్ల: వానాకాలం వచ్చిందంటే చాలు దుందుభీ పరివాహక ప్రాంతాల ప్రజల్లో ఆందోళన నెలకొంటుంది. వర్షాలు కురిసాయంటే చాలు వాగులు, వంకలు పారడం.. ఆయా ప్రాంతాల ప్రజలకు రాకపోకలు బంద్ కావడం ఏటా నిత్యకృత్యంగా మారింది. విధిలేని పరిస్థితుల్లో చుట్టూ కి.మీ.ల మేర తిరిగి వెళితే తప్ప ఇతర ప్రాంతాలకు వెళ్లలేని పరిస్థితి నియోజకవర్గంలోని పలు గ్రామాలు, తండాల ప్రజలు ఎదుర్కొంటున్నారు. జడ్చర్ల మండలంలోని కొండేడు–తుపుడగడ్డ తండాల మధ్య దుందుభీ వాగు ప్రవాహం ఉధృతమైన సమయంలో అటు ఇటుగా రాకపోకలు నిలిచిపోతాయి. రాకపోకలు సజావుగా సాగితే ఈ ప్రాంతాల మధ్య 2 కి.మీ.లు మాత్రమే ఉండగా వరద ముంచెత్తిన సమయంలో తుపుడగడ్డతండా నుంచి చిన్న ఆదిరాల, పెద్ద ఆదిరాల గ్రామాల మీదుగా దాదాపు 6 కి.మీ.ల మేర చుట్టూ తిరిగి రాకపోకలు సాగించాల్సి వస్తుందని తండా వాసులు తెలిపారు. నల్లకుంట తండా ప్రజల దుస్థితీ ఇదే. లింగంపేట–నల్లకుంటతండాల మధ్య దుందుభీ వాగు పొంగి పొర్లిన సమయంలో రాకపోకలు స్తంభిస్తాయి. దీంతో దాదాపు 6 కి.మీ.లకు పైగా చుట్టూ తిరిగి కోడ్గల్ నుంచి రావాల్సి ఉంటుంది. అదేవిధంగా కిష్టారం–అంబటాపూర్ మధ్య కూడా బ్రిడ్జి లేకపోవడంతో రాకపోకలు ఇబ్బందిగా మారాయి. పోలేపల్లి–కిష్టారం మధ్య చెరువు అలుగు పారిన సమయంలో


నసరుల్లాబాద్ చెరువు అలుగు పారి అల్వాన్‌పల్లి-తంగెళ్లపల్లి మధ్య నిలిచిన రాకపోకలు(ఫైల్)

రాకపోకలు నిలిచి ఉదండాపూర్, వల్లూరు మీదుగా జడ్చర్లకు చేరుకోవాల్సి ఉంటుంది. నసరుల్లాబాద్ చెరువు అలుగు పారితే లోతట్టు ప్రాంతంలోని అల్వాన్‌పల్లి–తంగెళ్లపల్లి గ్రామాల మధ్య రాకపోకలు నిలిచి ఇబ్బందులు తలెత్తుతాయి. ఎక్వాయపల్లి–లింగందన గ్రామాల మధ్య దుందుభీ వాగు ప్రవహిస్తే రాకపోకలు స్తంభించి పోతాయి.

వంతెనలు లేక ఇబ్బందులు

నెక్కొండ–బైరంపల్లి గ్రామాల మధ్య కూడా బ్రిడ్జి నిర్మించాలన్న డిమాండ్ ఉంది. అదేవిధంగా రాజాపూర్ మండలంలోని దోండ్లపల్లి–ఇప్పటూరు గ్రామాల మధ్య దుందుభీ వాగు పారిన సందర్భంగా రాకపోకలు స్తంభించి చుట్టు దాదాపు 10 కి.మీ.ల మేర తిరిగి వెళ్లాల్సి వస్తుంది. రాపల్లె–కుచ్చర్‌కల్ మధ్య ఇదే పరిస్థితి నెలకొంది. ఇక బాలానగర్ మండలంలో 44వ నంబర్ జాతీయ రహదారి నుంచి ఉడిత్యాల, మోతి ఘన్‌పూర్, సూరారం మార్గంలో, శేరిగూడ–బోడ జానంపేట మధ్య కూడా బ్రిడ్జి నిర్మాణం చేయాల్సి ఉంది. నవాబ్‌పేట మండలంలోని వీరశట్పల్లి నుండి దయాపంతులపల్లి మీదుగా హాజీపూర్ వెళ్లే మార్గంలో బ్రిడ్జి ఏర్పాటు చేయాల్సి ఉంది. నవాబ్‌పేట–దయాపంతుల పల్లి,మల్లారెడ్డిపల్లి–కారూర్ మధ్య బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. మిడ్జిల్ మండలంలో వల్లబురావుపల్లి నుంచి చౌటకుంటతండా మీదుగా వేముల మార్గంలో బ్రిడ్జి నిర్మాణం చేపడితే రాకపోకలకు సౌకర్యంగా ఉంటుంది. కొత్తూరు–వెలుగొమ్ముల మధ్య దుందుభీ వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాల్సి ఉంది.

రాకపోకలు నిలిచిపోతాయి..



దుందుభీ వాగు ఉధృతి పెరిగిన ప్రతి సారి రాకపోకలు నిలిచి ఇబ్బందులు పడుతున్నాం. దుందుభీ వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని గత కొన్ని సంవత్సరాలుగా కోరుతున్నా ఇప్పటి వరకు పట్టించుకోలేదు. గత ప్రభుత్వ హయాంలోను బ్రిడ్జి నిర్మిస్తామంటూ ప్రకటించారు. కానీ కార్యరూపం దాల్చలేదు. ఇప్పటికైనా బ్రిడ్జి నిర్మించేందుకు పాలకులు చర్యలు తీసుకోవాలి.

– జర్పుల ఈరన్న, తుపుడగడ్డ తండా

అలుగు పారితే అంతే..



పోలేపల్లి–కిష్టారం మధ్య చెరువు అలుగు పారినప్పుడల్లా రాకపోకలు బంద్ అవుతాయి. ఉదండాపూర్, వల్లూరు మీదుగా జడ్చర్లకు వెళ్లాల్సి వస్తుంది. కిష్టారం–అంబటాపూర్ మధ్య కూడా వరద ప్రవాహం పెరిగినప్పుడు రాకపోకలు నిలిచిపోతాయి. బ్రిడ్జిల నిర్మాణం చేపడితే ఇబ్బందులు తప్పుతాయి.

– గోపాల్‌రెడ్డి, కిష్టారం

ప్రతిపాదనలు పంపించాం..



నియోజకవర్గంలోని దుందుభీ వాగు, తదితర ప్రాంతాలలో రాకపోకలకు ఇబ్బందిగా మారే దగ్గర బ్రిడ్జిల నిర్మాణం చేపడతాం. ఇప్పటికే 9 బ్రిడ్జిలకు రూ.44.10 కోట్లతో ప్రతిపాదనలు నివేదించాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం. మిగతా చోట్ల కూడా బ్రిడ్జిల నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం.

– అనిరుధ్‌రెడ్డి, ఎమ్మెల్యే, జడ్చర్ల

రూ.44 కోట్లతో ప్రతిపాదనలు

నియోజకవర్గంలో రూ.44.10 కోట్ల వ్యయంతో వంతెనల నిర్మాణం చేపట్టేందుకు ఇటీవల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖకు ప్రతిపాదనలు పంపించారు. జడ్చర్ల మండలంలోని నల్లకుంట తండా రోడ్డుపై బ్రిడ్జికి రూ.4.50 కోట్లు, ఎక్వాయపల్లి–లింగందన రోడ్డు బ్రిడ్జికి రూ.3 కోట్లు, నెక్కొండ–బైరంపల్లి రోడ్డు బ్రిడ్జికి రూ.4.50 కోట్లు, కొండేడు–తుపుడగడ్డ తండా బ్రిడ్జికి రూ.4.50 కోట్లు ప్రతిపాదించినట్లు తెలిపారు. అదేవిధంగా బాలానగర్ మండలంలోని జాతీయ రహదారి ఉడిత్యాల, మోతీఘన్‌పూర్, సూరారం మార్గంలో బ్రిడ్జి నిర్మాణానికి రూ.3 కోట్లు, శేరిగూడ–బోడ జానంపేట బ్రిడ్జికి రూ.6 కోట్లు, నవాబ్‌పేట మండలంలోని వీరశట్పల్లి నుంచి దయాపంతుల పల్లి మీదుగా హాజీపూర్ వెళ్లే మార్గంలో బ్రిడ్జి ఏర్పాటుకు రూ.2.40 కోట్లు, రాజాపూర్ మండలంలోని రాయపల్లి– కుచ్చర్‌కల్ రోడ్డు బ్రిడ్జికి రూ.6 కోట్లు, మిడ్జిల్ మండలంలో వల్లబురావుపల్లి నుంచి చౌటకుంటతండా మీదుగా వేముల మార్గంలో బ్రిడ్జి నిర్మాణానికి రూ.10.20 కోట్లు చొప్పున మొత్తం 9 వంతెనల నిర్మాణానికి రూ.44.10 కోట్లు మంజూరుకు ప్రతిపాదించారు. ఇప్పటికైనా ఆయా బ్రిడ్జిల నిర్మాణాలు పూర్తయితే వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు తీరే అవకాశం ఉంటుందని, పాలకులు అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

జూరాలకు మళ్లీ పెరిగిన వరద

- 1.08 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 12 క్రస్ట్‌గేట్లు ఎత్తి దిగువకు విడుదల


జలాశయం నుంచి దిగువకు పారుతున్న వరద

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద ఆదివారం మళ్లీ పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శనివారం 75 వేల క్యూసెక్కులు ఉండగా.. ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో 1.08 లక్షలకు చేరిందన్నారు. దీంతో 12 క్రస్ట్‌గేట్లు ఎత్తి 58,884 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నామని చెప్పారు. అలాగే విద్యుదుత్పత్తి నిమిత్తం 32,719 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315, నెట్టెంపాడుకు 750, ఆవిరి రూపంలో 44, ఎడమ కాల్వకు 550, కుడి కాల్వకు 500, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 150, సమాంతర కాల్వకు 200, భీమా లిఫ్ట్–2కు 750 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు చెప్పారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 7.933 టీఎంసీల నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి..

ఆత్మకూర్: జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద భారీగా వస్తుండటంతో దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి నిర్విరామంగా కొనసాగుతుందని ఎస్ శ్రీధర్ తెలిపారు. ఆదివారం ఎగువన 5 యూనిట్ల నుంచి 195 మెగావాట్లు, 165.284 మి.యూ., దిగువ 6 యూనిట్ల నుంచి 240 మెగావాట్లు, 196.082 మి.యూ. విద్యుదుత్పత్తి చేపట్టామన్నారు. ఎగువ, దిగువ కేంద్రాల్లో ఇప్పటి వరకు 361.366 మి.యూ. ఉత్పత్తి విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు.

సుంకేసులకు 50 వేల క్యూసెక్కులు..

రాజోళి: సుంకేసుల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద ఆదివారం పెరిగింది. 50 వేల క్యూసెక్కుల వరద జలాశయానికి చేరుతుండగా.. 14 గేట్లను తెరిచి 52,682 క్యూసెక్కుల నీటిని దిగువకు, కేసీ కెనాల్‌కు 1,847 క్యూసెక్కులు మొత్తం 54,529 క్యూసెక్కులు వినియోగించినట్లు జేఈ మహేంద్ర వివరించారు.

శ్రీశైలంలో ఒక గేట్ పైకెత్తి..



దోమలపెంట: శ్రీశైలం ఆనకట్ట వద్ద ఆదివారం ఒక గేట్‌ను పది అడుగుల మేర పైకెత్తి 26,698 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఎగువన జూరాల ఆనకట్ట గేట్లు పైకెత్తి స్పిల్‌వే ద్వారా 31,504 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 34,088, సుంకేసుల నుంచి 52,682 క్యూసెక్కులు శ్రీశైలం జలాశయానికి చేరుతుందని వివరించారు. భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 31,102 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న నాగార్జునసాగర్‌కు విడుదల చేశారు. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 30 వేల క్యూసెక్కులు, హెచ్ఎన్ఎస్ఎస్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 2,401, ఎంజీకేఎల్ఐకు 1,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 17.335 మి.యూ., కుడిగట్టు కేంద్రంలో 15.917 మి.యూ. విద్యుదుత్పత్తి చేశారు.

చిరు ధాన్యాల సాగు.. బహుళ లాభాలు

పాడి-పంట
జిల్లా వ్యవసాయాధికారి, సక్రియానాయక్

అలంపూర్: చిరు ధాన్యాల సాగుతో అధిక లాభాలు గడించే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు సూచించారు. వాటిలో కొర్ర ముఖ్యమైంది. కొర్రలలో పోషకాలతో పాటుగా ఔషధ గుణాలు పుష్కలంగా ఉంటాయి. వీటిలో పిండి పదార్థాలు తక్కువ, పీచు పదార్థాలు ఎక్కువగా ఉంటాయి. ఈ కారణంగా ఊబకాయంతో బాధపడే వారికి మంచి ఆహారంగా గుర్తించారు. వీటిని అన్నానికి బదులుగా తీసుకోవడం ద్వారా చక్కెర వ్యాధి, గుండె జబ్బులు, ఇతర రోగాలను అదుపులో ఉంచుకోవచ్చు. దీంతో కొర్రకు మంచి డిమాండ్ వచ్చింది. ప్రస్తుత పరిస్థితుల్లో కొర్ర పంట సాగు చేసుకోవడం రైతులకు లాభదాయకమని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియానాయక్ రైతులకు సూచించారు. కొర్ర సాగు, యాజమాన్య పద్ధతులు గురించి తెలుసుకుందాం.

సాగు: కొర్ర పంటను వానాకాలంలో జూన్, జులై నెలల్లో, వేసవి పంటగా జనవరిలోనూ విత్తుకోవచ్చు.

రకాలు: కృష్ణదేవరాయ, నరసింహారాయ, శ్రీలక్ష్మి, ఎస్ఐఏ 3085 రకాలు సాగు చేస్తే 80 నుంచి 85


కొర్ర పంట సాగు (ఫైల్)

రోజుల్లో కోతకు వస్తాయి. అలాగే ప్రసాద్, సూర్యనంది (ఎస్ఐఏ3088) రకాలు 70 నుంచి 75 రోజుల్లో కోతకు రావడంతో పాటు అధిక దిగుబడి ఇస్తాయి.

విత్తన మోతాదు: సాళ్లలో విత్తితే ఎకరాకు రెండు కిలోలు, వెదజల్లే పద్ధతిలో అయితే నాలుగు కిలోల విత్తనం సరిపోతుంది.

- కిలో విత్తనానికి రెండు గ్రాముల కార్బండిజమ్‌తో విత్తన శుద్ధి చేయాలి.
- 25 సెం.మీ ఎడం ఉన్న సాళ్లలో మొక్కల మధ్య 10 సెం.మీ దూరం ఉండేలా విత్తుకోవాలి.
- అంతర్ పంటగా ప్రతి ఐదు సాళ్లకు ఒక సాలు కంది వేయాలి. లేదా 2:1 నిష్పత్తిలో కొర్ర, వేరుశనగ వేసుకోవచ్చు.
- విత్తిన రెండు వారాల్లోపు ఒత్తు మొలకలు తీసివేయాలి.
- 30 రోజుల వరకు పంట పొలంలో కలుపు మొక్కలు లేకుండా చూడాలి.
- విత్తిన 20 నుంచి 25 రోజుల తర్వాత సాళ్లల్లో అంతర్ కృషి చేసి కలుపు నివారించాలి.

ఎరువులు: ఆఖరి దుక్కిలో నాలుగు టన్నుల పశువుల ఎరువులను పొలంలో వేసి బాగా కలియదున్నాలి. విత్తేటప్పుడు 20 కేజీల యూరియా, ఒక బస్తా (50 కేజీలు) సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ వేయాలి. విత్తిన నెల రోజులకు మరో 20 కేజీల యూరియాను పైపాటుగావేయాలి.

సస్యరక్షణ: కొర్ర పంటను ఆశించే వాటిలో గులాబీ రంగు పురుగు, కాండం తొలిచే పురుగు, చెదలు, మిడతలు, లద్దె పురుగు ముఖ్యమైనవి.

- చెదల నివారణకు చివరి దుక్కిలో ఫాలిడాల్ రెండు శాతం పొడి మందును ఎకరాకు 10 నుంచి 12 కిలోల వంతున మట్టిలో బాగా కలిసేటట్లు వేయాలి.
- మిడతల నివారణకు కార్బరిల్ 5 శాతం పొడి మందును ఎకరాకు 10 నుంచి 12 కిలోల చొప్పున చల్లాలి.
- కిలో విత్తనానికి 3 గ్రాముల కాప్టాన్/థైరామ్, మందుతో విత్తన శుద్ధి చేయడం ద్వారా తుప్పు, అగ్గి, వెర్రికంకి తెగుళ్లను కొంత వరకు అరికట్టవచ్చు.

'బీసీలను అవమానిస్తే మూల్యం తప్పదు'


మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోనెల శ్రీనివాసులు

మెట్టుగడ్డ: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో బీసీ నాయకుడిని అవమానించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోనెల శ్రీనివాసులు మండిపడ్డారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బీసీ సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. బీసీ నాయకుడికి జరిగిన అవమానాన్ని యావత్ బీసీ సమాజానికి జరిగిన అవమానంగా భావిస్తున్నామని, తక్షణమే ఎంపీ డీకే అరుణ బీసీ నాయకుడికి, బీసీ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీసీ ఓట్లతో గెలిచి, నేడు అదే సమాజానికి చెందిన వారిని అవమానిస్తూ చిన్న చూపు చూడటం తగదన్నారు. బీసీలకు క్షమాపణ చెప్పకపోతే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి సరైన పద్ధతిలో బుద్ధి చెప్తామన్నారు.

రద్దీ ఏరియాల్లో నిఘా పెంచుతాం

- పాలమూరు ఎస్పీ జానకి
- పట్టణంలో అర్ధరాత్రి విస్తృత తనిఖీలు


బస్టాండ్‌లో అనుమానితుల ఫింగర్ ప్రింట్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా కేంద్రంలోని రద్దీ ఏరియాల్లో నిఘా పెంచుతామని ఎస్పీ జానకి పేర్కొన్నారు. శనివారం అర్ధరాత్రి ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్ వద్ద ఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. మొదట ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లిన ఎస్పీ అక్కడ వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు నిద్రిస్తున్నండగా.. వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొంతమంది అనుమానితులు కన్పిస్తే వారిని అదుపులోకి తీసుకుని ఫింగర్ ప్రింట్ డివైస్ సహాయంతో వారి వివరాలు పరిశీలించారు. అనంతరం రైల్వేస్టేషన్‌లో కూడా పలు రైళ్లకోసం ఎదురుచూస్తున్న ప్రయాణికుల లగేజీతోపాటు వారి వివరాలను ఆరా తీశారు. అదేవిధంగా అనుమానితుల ఫింగర్ ప్రింట్‌లు సేకరించారు. ఎస్పీ మాట్లాడుతూ.. బస్టాండ్, రైల్వేస్టేషన్‌లో అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులపై నిత్యం నిఘా పెట్టడంతో నేరాల నియంత్రణకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఫింగర్ డివైస్ సహాయంతో వ్యక్తుల వేలిముద్రలు క్షుణ్ణంగా పరిశీలించి నేర చరిత్ర ఉంటే అదుపులోకి తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ తనిఖీలు భవిష్యత్‌లో మరింత విస్తృతం చేస్తామని, పోలీసుల నిఘా చర్యలతో నేరాల తగ్గుముఖం పట్టాయని తెలిపారు. తనిఖీలో డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి, ఇతర పోలీసులు పాల్గొన్నారు.

'కోట్ల'కు సినారె సాహిత్య పురస్కారం ప్రదానం


కోట్ల వెంకటేశ్వరరెడ్డికి పురస్కారం అందజేసిన జస్టిస్ కె.లక్ష్మణ్, నందిని సిధారెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పాలమూరుకు చెందిన కవి కోట్ల వెంకటేశ్వరరెడ్డికి ఆదివారం యాదాద్రి–భువనగిరిలో ఆ జిల్లా రచయితల సంఘం, సాహిత్య సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో సినారె సాహిత్య పురస్కారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయనను సీనియర్ సిటిజన్స్ ఫోరం అధ్యక్షుడు జగపతిరావు, ఉపాధ్యక్షుడు ఎ.రాజసింహుడు, జిల్లా కళాకారుల సంఘం అధ్యక్షుడు వి.మనోహర్ రెడ్డి, తెలంగాణ సాహితీ అధ్యక్షుడు డా.భీంపల్లి శ్రీకాంత్ అభినందించారు.

పాన్‌గల్ కోటలో పులివేట వీరగల్లు ప్రతిమ


కోటపై వీరగల్లు ప్రతిమను పరిశీలిస్తున్న డా.బైరోజు శ్యాంసుందర్

పాన్‌గల్: వనపర్తి జిల్లా పాన్‌గల్ మండల కేంద్రంలోని ఖిల్లా కోటకు చాలా ప్రాచీన చరిత్ర ఉంది. కోటలో అనేక కట్టడాలు, ఫిరంగులతో పాటు ఎన్నో శిల్పాలు, వీరగల్లు విగ్రహాలున్నాయి. కోటలోకి వెళ్తుంటే ముళ్ల గవినిగా పిలవబడే ప్రదేశం వద్ద దాదాపు నాలుగు అడుగులున్న పులివేట వీరగల్లు ప్రతిమను కొత్త తెలంగాణ చరిత్ర బృందం పరిశోధన సభ్యులు బైరోజపు చంద్రశేఖర్, బైరోజు శ్యాంసుందర్ ఆదివారం గుర్తించారు. ఈ దుర్గం వద్ద కనిపించే పులి, పందివేట వీరగల్లులు ప్రత్యేక ఆకర్షణ. పులులు, అడవి పందుల నుంచి ప్రజలను కాపాడిన వీరుల సాహసాన్ని గుర్తుచేసే వీరగల్లులు, ఊరి పొలిమేరల్లో ప్రజల అభిమానానికి నిదర్శనంగా నిలిచాయి. రాతిపై వీరగల్లు ప్రతిమలో కుడివైపు సిగ, తలపై పాగా, మెడలో కంటె, వీరకాసెతో కనిపిస్తున్న వీరుడు రెండు చేతుల బల్లెంతో పులిని చంపుతున్న దృశ్యం ఒక రాతిపలక మీద ఉపశిల్పంగా చెక్కబడింది. ఈ వీరగల్లు ప్రతిమ క్రీ.శ.13, 14వ శతాబ్దాల నాటి శైలిలో చెక్కబడి ఉంది. అరుదుగా కనిపించే, ప్రతిఫలించే ఈ పులివేట వీరగల్లు ప్రతిమ మరొకటి ఇదే మండలంలోని బుసిరెడ్డిపల్లి కూడా ఉందన్నారు. ఇవి అరుదైన వీరగల్లులు అని ఇలాంటివి తెలంగాణలో నిజామాబాద్, భువనగిరి, ఖమ్మం, వరంగల్, నిర్మల్ జిల్లాలో కూడా ఉన్నాయని వారు తెలిపారు. ఇప్పుడు వనపర్తి జిల్లాలో ఈ పులివేట వీరగల్లు ఉండడం ఇక్కడి వీరుల పరాక్రమాన్ని తెలియజేస్తున్నాయని వివరించారు. వీటిని భద్రపరచడమో లేదా ఏదేని మ్యూజియానికి చేర్చాలని స్థానిక ప్రజలు ప్రభుత్వాన్ని కోరారు. అలాగే పాన్‌గల్ ఖిల్లాను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తే ప్రాంతీయ ప్రగతికి దోహదం చేస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఉత్సాహంగా ఎంపికలు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న పుట్టి సురేష్‌చందర్

మహబూబ్‌నగర్ క్రీడలు: వరంగల్‌లో వచ్చేనెల 3, 4 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి అంతర్‌జిల్లా అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారుల ఎంపికలను ఆదివారం జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో నిర్వహించారు. అండర్–14, అండర్–16, అండర్–18, అండర్–20 విభాగాల బాలబాలికలు, పురుషుల, మహిళా విభాగాల ఎంపికలు నిర్వహిచారు. ఈ సందర్భంగా జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఉపాధ్యక్షులు పుట్టి సురేష్‌చందర్, ప్రధాన కార్యదర్శి జి.శరత్‌చంద్ర క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడుతూ జిల్లా అథ్లెట్లు రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించి జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీడీలు రమేష్‌బాబు, సి.శ్రీనివాసులు, ఫి.శ్రీనివాసులు, కోచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో కిరాణ షాపు దగ్ధం

పాన్‌గల్: మండలంలోని మాందాపూర్‌లో షార్ట్‌సర్క్యూట్‌తో కిరాణం షాపు దగ్ధమైన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాసులుకు చెందిన కిరాణం దుకాణంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో కిరాణం సామగ్రి, ఫ్రిజ్, టీవీ, ఇతర వస్తువులు దగ్ధమైన బాధితుడు పేర్కొన్నారు. ఘటనలో దాదాపుగా రూ.60 వేల వరకు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. గతంలో కూడా గ్రామంలో ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. విద్యుత్ అధికారులు స్పందించి ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.